సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం। 16। సెప్టెంబర్। 2024



ఆహ్లాదం.. ఆట విడుపు

ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నగరవనాలుఅందు బాటులోకి వచ్చాయి. అన్నమయ్య ఎకోపార్కు పేరుతో పూర్తి చేశారు. - 8లో



కుక్కల దాడిలో దుప్పి మృతి

కుక్కల దాడిలో దుప్పి మృతి చెందింది. ఈ ఘటన బి.కొత్తకోట మండలం పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ అటవీ ఘాట్‌రోడ్డుపై ఆదివారం చోటుచేసుకుంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.400
రెండోరకం	రూ.240	రూ.356

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 94 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

హార్సిలీహిల్స్‌పై హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి మన్మథరావుకు స్వాగతం పలుకుతున్న అధికారులు

బి.కొత్తకోట : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.మన్మథరావు ఆదివారం మధ్యాహ్నం బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ సందర్శనకు విచ్చేశారు. కుటుంబంతో కలిసి విచ్చేసిన న్యాయమూర్తికి మదనపల్లె ఏడీజే న్యాయమూర్తి అబ్రహం, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి శ్రీనివాసరెడ్డి, సీఐ రాజారమేష్, డీటీ అహ్మద్ అన్సారీ, టూరిజం మేనేజర్ నేదురుమల్లి స్వాలీస్‌రెడ్డి, ఆర్ఐ బాలాజీ, వీఆర్‌ఓ నరేంద్ర స్వాగతం పలికారు. ఇక్కడి గవర్నర్ బంగ్లాలో విడిది ఏర్పాట్లు చేశారు. సోమవారం సాయంత్రం ఇక్కడినుంచి వెనుదిరిగి వెళ్లనున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాత్కాలిక రద్దు

రాయచోటి : ఈనెల 16వ తేదీ జరగబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్స్ సిస్టం) కార్యక్రమాన్ని మిలాద్ ఉన్ నబీ సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులను సమర్పించేందుకు జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లరాదని కలెక్టర్ తెలిపారు.

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు



తైక్వాండో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలను అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గీత, విజయభాస్కర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మరక్షణ విద్యలకు ఆదరణ పెరుగుతోందన్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో రాణించడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా శారీరక, మానసిక ధృడత్వం లభిస్తుందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ చక్కగా రాణించి మీ జిల్లాకు, రాష్ట్రానికి ఖ్యాతి తీసుకురావాలని కోరారు.

గంగమ్మా.. వానలు కురిపించు తల్లీ



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి : గంగమ్మా వర్షాలు కురిపించు తల్లీ అంటూ భక్తులు శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ దేవతకు బోనాలు సమర్పించారు. ఆదివారం కావడంతో వేలాది మంది భక్తులు గంగమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు ఉన్నవారు తలనీలాలు అర్పించారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



కౌశిక్

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కోటపాటి కౌశిక్ సబ్‌జూనియర్స్ విభాగంలో జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈవిషయాన్ని బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.కృష్ణమూర్తి, జీ.వెంకటరమణ ఆదివారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈనెల 13 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అన్నవరంలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో కౌశిక్ ప్రతిభ కనబరచడంతో క్రీడాధికారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి హరియాణలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో కౌశిక్ పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

మంత్రి వ్యాఖ్యలు అర్థరహితం



రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలల ప్రారంభోత్సవం విషయంలో రాష్ట్ర ఆరోగ్య, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితం. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నిర్మాణాలను పూర్తి చేసుకున్న కళాశాలలకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు సీట్లు కేటాయించినా ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను బూచిగా చూపడం అన్యాయం. వైద్య విద్య అభ్యసించాలన్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు మంత్రి మాటలు తీవ్ర ఆవేదనను కల్గిస్తున్నాయి. రాష్ట్రంలో ఐదు నూతన కళాశాలలకు అనుమతులు వచ్చినా కూటమి ప్రభుత్వం వాటిని నిర్వహణను చేపట్టలేమంటూ చేతులెత్తేయడం దారుణం.- ఆర్ రమేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, లక్కిరెడ్డిపల్లి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే...



మెడికల్ కాలేజీలను ప్రారంభించి ఉంటే రాష్ట్ర విద్యార్థులకు అదనంగా మెడికల్ సీట్లతో పాటు, పేదలకు నాణ్యమైన సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన మెడికల్ కళాశాలలను ప్రారంభిస్తే..ఘనత వారి ఖాతాలోకి వెళుతుందని, కావాలనే ప్రారంభాన్ని వాయిదా వేయించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి అటు విద్యార్థులకు, ఇటు ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారు. వైద్యశాఖ మంత్రికి ఈ విషయంపై అవగాహన లేకుండా అనవసరంగా గత ప్రభుత్వాన్ని విమర్శించడం తగదు. - గుండ్లూరురఫీ, మోతీనగర్, మదనపల్లె.

టమాటా సాగులో సరికొత్త ప్రయోగం

- సీడ్స్ కట్టెల బదులు జింక్‌పైపుల వినియోగం
- ఎకరాకు 900పైపులకు ఖర్చు రూ.2.20లక్షలు
- జిల్లాలో తొలగిసారిగా రైతులు వినియోగం



జింక్‌పైపుల ద్వారా సాగు చేసిన టమాట పంటలో టమాటచెట్లకు పుర్రి కడుతున్న కూలీలు

గుర్రంకొండ : జిల్లాలో ముఖ్యమైన పంట అయిన టమాటా సాగులో రైతులు సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సీడ్స్ కట్టెల బదులు కొత్తగా జింక్‌పైపులను వినియోగించారు. ఎకరా సాగుకు 900 జింక్‌పైపులు అవసరం ఉంటుంది. మార్కెట్లో వీటి విలువ రూ.2.20లక్షలు వరకు ఉంది. సాధారణ సీడ్స్ కట్టెల కాలపరిమితి ఒకటిన్నర నుంచి రెండు సంవత్సరాల వరకు ఉంటుంది. అయితే జింక్ పైపుల కాలపరిమితి సుమారు 15 సంవత్సరాలకు పైనే ఉండడం వీటి ప్రత్యేకత. ఈపద్ధతితో అడవులు, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. జిల్లాలో తొలిసారిగా రైతులు జింక్‌పైపులతో పంటసాగు చేయడం ప్రారంభించడం గమనార్హం

ఎకరానికి రూ. 2.20లక్షలు ఖర్చు

బోరుపైపులకు వినియోగించే జింక్‌తో తయారు చేసిన ఒక ఇంచి పరిమాణం వెడల్పుతో ఉన్న పైపులు తొలిసారిగా టమాటా సాగులో వినియోగించారు. ఒక పైపు పొడవు రెండుమీటర్ల వరకు ఉంది. ఒకపైపు బరువు 2.50 కేజీలు ఉంటుంది. ఎకరం పంట సాగుకు 900 పైపుల అవసరం ఉంటుంది. మార్కెట్లో కిలో జింక్‌పైపు ధర రూ.90. ఈలెక్కన ఒకపైపు రూ.240 వరకు ధర పలుకుతుంది. 900పైపులకుగాను వెల్డింగ్ ఖర్చులు కలుపుకొంటే రూఈ 2.20లక్షల వరకు వస్తుంది.

15 సంవత్సరాల కాలపరిమితి

ఒక సారి జింక్‌పైపులు కొనుగోలు చేస్తే సుమారు 15సంవత్సరాల వరకు వీటిని రైతులు వినియోగించుకోవచ్చు. వీటిలో ఎటువంటి తరుగు, చెడిపోవడం జరగదు. మట్టిబురదలో ఉంచినా, వర్షాలు కురిసినా, చెదలు పట్టకుండా మన్నికగా ఉంటాయి. పైపులు కొనుగొలు చేసి పంటలో నాటే సమయంలో జింక్‌పైపునకు కింది భాగంలో ఒక అడుగు వరకు మెటల్ ప్రైమర్ రంగు పూయాల్సి ఉంటుంది. దీంతో భూమిలో ఎన్నిరోజులు పైపులు ఉన్నా చెదలు, ఇతర కీటకాలు ఏవీ వీటి దరిచేరవు. సుమారు 30 పంటల సాగు వరకు జింక్‌పైపుల్ని వినియోగించుకోవచ్చు. సీడ్స్ కట్టెల కాలపరిమితి ఒకటిన్నర నుంచి రెండు సంవత్సరాల వరకు మాత్రమే ఉంటుంది. సీడ్స్ కట్టెలు నాణ్యతను బట్టి రెండు నుంచి మూడు పంటల వరకు మాత్రమే వినియోగించుకోవచ్చు. ఆతరువాత వీటిని మూలనపడేయాల్సిందే. ప్రతి పంటకు 20శాతం కట్టెల నాణ్యత తగ్గిపోతూ ఉంటుంది. మూడు పంటల సాగు అనంతరం పూర్తి సీడ్స్ కట్టెలు వినియోగానికి పనికిరాకుండా పోతాయి.

రైతులకు రూ.5. లక్షలు ఆదా

జింక్‌పైపులు టమాటా పంటలో వినియోగించడం వల్ల రైతుకు ఎకరాకు రూ.5లక్షలవరకు ఆదా అవుతుంది. 15సంవత్సరాలకు పైగా పంటసాగు చేయడానికి రైతు సీడ్స్ కట్టెల కోసం రూ. 7.20 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో 15 సంవ్సరాల మన్నిక వచ్చే జింక్‌పైపుల కొనుగోలకు ఎకరానికి రూ.2.20లక్షలు ఖర్చు వస్తుంది. ఈలెక్కన జింక్‌పైపుల వినియోగంతో రైతుకు ఒక ఎకరానికి రూ. 5 లక్షల వరకు ఖర్చు ఆదా అవుతుంది. ఈపద్ధతి ఎంతోలాభసాటిగా ఉండడంతో జిల్లాలోని మదనపల్లె, కురబలకోట, గుర్రంకొండ మండలాల్లో రైతులు తొలిసారిగా జింక్‌పైపుల వినియోగంతో టమాటా పంట సాగుకు శ్రీకారం చుట్టారు.

పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు



టామాటాలో జింక్‌పైపులు వినియోగించడం వల్ల ఇటు పర్యావరణ పరిరక్షణ అటు అడవులు నాశనం కాకుండా ఉంటాయి. కొండలు, గుట్టలు, అడవులు సమీపంలో ఉన్న గ్రామాల్లో అయితే కొంతమంది రైతులు సీడ్స్ కట్టెల కోసం అడవుల్లోని మొక్కలను, చెట్లను ఇష్టానుసారం నరికేస్తుంటారు. సీడ్స్ కట్టెల వ్యాపారం లాభాసాటిగా ఉండడంతో కొంతమంది కూలీలు అడవుల్లో సీడ్స్ కట్టెలను నరికి తీసుకొచ్చి రైతులకు విక్రయిస్తుంటారు. దీంతో అడవులు నాశనం అవుతుండడంతో పాటు పర్యావరణంలో వాతావరణ సమతుల్యత దెబ్బతింటోంది. జింక్‌పైపులు వినియోగంతో వీటి పరిరక్షణకు ఎలాంటి ఢోకా ఉండకపోవడం గమనార్హం.

▶▶ పదిచెట్లకు ఒకపైపు



టమాటా పంట సాగులో ఒకవరసలో ఉన్న పదిచెట్లకు ఒకపైపు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సీడ్స్ కట్టెలు అయితే ఐదు చెట్లకు ఒక కట్టెను ఏర్పాటు చేస్తుంటారు. టమాటా చెట్టు పెరిగే సైజును బట్టి సీడ్స్ కట్టెకు కింది నుంచి మూడు వరసల వరకు గోనెసంచిలకు ఉపయోగించే పుర్రికొసను ఏర్పాటు చేస్తారు. జింక్‌పైపు చిన్నపాటి రంధ్రాలు ఉన్న వాచర్‌లు, పదిహేను సెంటిమీటర్ల పొడవున్న ఇనుపకమ్మీలు వెల్డింగ్ చేసి వైర్‌ను చుట్టేస్తారు. పంట ఏపుగా పెరిగే పరిస్థితి బట్టి జింక్‌పైపులను మార్చి వినియోగిస్తారు. వీటిని రెండు నుంచిమూడు రకాలుగా ఉపయోగించుకొనేందుకు వీలుగా ఉండడం జింక్‌పైపుల ప్రత్యేకత.

▶▶ సీడ్స్ కట్టెలైతే రూ. 90 వేలు ఖర్చు

ఎకరం టమాటా పంటకు సీడ్స్ కట్టెలు వినియోగించాలంటే రైతుకు రూ.90 వేలు ఖర్చు వస్తుంది. ఎకరం సాగుకు సుమారు 3 వేల సీడ్స్ కట్టెలు అవసరం ఉంటుంది. మార్కెట్లో ఒక సీడ్ కట్టె ధర రూ.27 నుంచి రూ.30 వరకు పలుకుతోంది. ఈలెక్కన ఎకరం పంట సాగుకు రూ. 90 వేలు సీడ్స్ కట్టెలను రైతులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

మూడున్నర ఎకరాలు సాగు చేశా



జింక్‌పైపులతో మూడున్నర ఎకరాల టమాటా పంటను సాగు చేశాను. రూ. 8 లక్షల వరకు ఖర్చు వచ్చింది. మంచి మన్నిక ఉన్న జింక్‌పైపులతో 15 సంవత్సరాల పాటు టమాటా పంట సాగు చేసుకోవచ్చు. సీడ్స్ కట్టెలు అయితే మూడు పంటల వరకే పనికి వస్తాయి. తర్వాత ఉపయోగపడవు. జింక్‌పైపులకు ఆ సమస్య లేదు. చిలుముపట్టడం, తుప్పపట్టడం వంటివి జింక్‌పైపుల్లో జరగదు. వీటిని వాడడం వల్ల రైతుకు ఎంతోమేలు జరుగుతుంది.
- ప్రభాకర్‌రెడ్డి, వీఎస్ఎస్ చైర్మన్, రైతు, మధ్యాహ్నంవారిపల్లె

పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు



జింక్‌పైపుల వినియోగంతో అడవులు, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. టమాటా పంట సాగులో అవసరమైన సీడ్స్ కట్టెల కోసం కొంతమంది అడవుల్లో చెట్లను ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. ముఖ్యంగా కొండలు, అడవులకు సమీపంలో ఉండే గ్రామాల్లో సీడ్స్ కట్టెల కోసం చెట్లను నరికేస్తున్నారు. ప్రారంభంలో కొంత ఖర్చు భారమనిపించినా జింక్‌పైపులతో టమాటా రైతులకు లాభం చేకూరుతుంది. ఒకసారి జింక్‌పైపులు కొనుగోలు చేస్తే ఏళ్ల తరబడి సీడ్స్ కట్టెల అవసరం ఉండదు.
- రమణయ్య, టమాటా రైతు,కొత్తపల్లె

దసరా అలంకరణ పనులకు వేళాయె



అలంకరణ పనులకు అంకురార్పణ చేస్తున్న పురోహితులు

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు తరువాత రాజంపేట పట్టణంలోని అమ్మవారిశాలలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నందున ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అలంకరణ పనులకు పూజా కార్యక్రమాలతో శ్రీకారం చుట్టారు. ఈనెల 18వ తేదీ నుంచి మహాలాయల పక్షం ప్రారంభం కానుండటంతో అమ్మవారిశాల ఆలయ ప్రధాన అర్చకులు పద్మనాభ సోమయాజుల నరసింహులుస్వామి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అలంకరణ పనులకు అంకురార్పణ చేశారు. ఈ ఏడాది చూపరులను అబ్బురపరిచేలా అలంకరణలను చేపట్టనున్నట్లు ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యయులు పబ్బిశెట్టి సుబ్రమణ్యం, నటకల రామకృష్ణ తెలిపారు. అమ్మవారి శాల వీధితో పాటు పట్టణంలోని పలు కూడలి ప్రాంతాల్లో విద్యుత్ దీపాలతో అమ్మవారి ప్రతిమలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది తమిళనాడు, తెనాలి ప్రాంతాలకు చెందిన కళాకారులు అలంకరణ పనులను చేపట్టనున్నారని వివరించారు. పదిరోజుల పాటు జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా నిత్యం అమ్మవారిశాలకు వేలాది మంది భక్తులు వస్తారని అందువల్ల భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పదుచూరు చంద్రశేఖర్, మాగలూరు విజయ్‌భాస్కర్‌గుప్తా, వల్లంకొండు చంద్రశేఖర్, ఎస్.సుధాకర్, బింగి హరికృష్ణ, వెంకటేశ్వర్లు, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు ప్రారంభం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆదివారం సాయంత్రం ఆలయ ముఖ మండపంలో ప్రత్యేక వేదికపై దేవతామూర్తులను కొలువుదీర్చి పలు పూజా కార్యక్రమాలు, పవిత్రాల ప్రతిష్ఠ చేపట్టారు. అర్చక బృందం మచ్చా శేషాద్రిచార్యులు బృందం తదితరులు పూజాదికాలను నిర్వహించారు. తొలుత పుష్కరిణి వద్ద పుట్టమన్ను సేకరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సాయంత్రం భగవత్ అనుజ్ఞ, విశ్వక్సేన పూజ, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, వాస్తు హోమం తదితరాలు నిర్వహించారు. అనంతరం మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. సోమ, మంగళ, బుధవారాలలో కూడా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

తిరుమల-తిరుపతి దేవస్థానాల పరిధిలోని దేవునికడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి కొలువుదీర్చారు. అర్చకులు కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు.

షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ : మదనపల్లె- నిమ్మనపల్లె రోడ్డులో ఉన్న వశిష్ట సీబీఎస్‌ఈ పాఠశాల గ్రౌండ్ లో జూనియర్ షూటింగ్ బాల్ బాలురు, బాలికల జట్లు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి గౌతమి తెలిపారు. ఎన్నికైన జిల్లా జట్టుకు పాఠశాల తరపున క్రీడా దుస్తులు ఇవ్వడం జరుగుతుందని వశిష్ట స్కూల్ చైర్మన్ పీవీఆర్.గుప్తా తెలియజేశారు. రాయలసీమ షూటింగ్ బాల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ నరేష్ బాబు, వశిష్ట మేనేజింగ్ ట్రస్టీ యశ్వంత్, షూటింగ్ బాల్ ఎన్ఐఎస్ కోచ్ యూసుఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు మురళి, గురు, మణి, సీనియర్ క్రీడాకారులు శ్రీ కుమార్, గాయత్రి, ప్రసన్న, భార్గవి పాల్గొన్నారు.

బాలుర జట్టు : జయంత్, చరణ్ తేజ్, అరుణ్ కుమార్ ,విష్ణువర్ధన్ రెడ్డి ,రవి కిరణ్, షణ్ముఖ, సంజయ్ రెడ్డి, ఫైజల్, పురుషోత్తం , చరణ్ తేజ్, ఓంకార్ , భరత్, సదాశివ స్టాండ్ బైలుగా సాయి ప్రసాద్ రెడ్డి, మోక్షిత్ మౌళి , మానిష్.

బాలికలు : రెడ్డి మౌనిక అనూష , కళ్యాణి, మానస, దయాన, బేబీ, మౌనిక, నిహారిక, నవ్య లత, సాయి జోషిత, లాస్య, యోగితా రెడ్డి స్టాండ్ బైలుగా గురు ప్రియ, సంధ్య, షాలినీలు ఎన్నికయ్యారు.

రాపూర్ ఘాట్ రోడ్డు!

- 18కిలోమీటర్లు..30 మలుపులు
- ఎదురెదురుగా వాహనాలువస్తే..
- భయం..భయంగా ప్రయాణం



రాజధానికి వెళ్లే రాపూరు ఘాట్‌రోడ్డు మలుపు వద్ద ఉన్న సింగల్‌రోడ్డు దుస్థితి

రాజంపేట : ఉభయజిల్లాల్లో రాజధానికి రాపూరు ఘాట్‌రోడ్డును రెండో రహదారిగా వినియోగించుకుంటున్నారు. అనంతపురం, కదిరి, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలకు చెందిన వారు ఈ రోడ్డు మార్గంలో నెల్లూరు, కావలి, ఒంగోలు, విజయవాడ, బెజవాడ, కాకినాడ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రాజంపేట-నెల్లూరు రహదారిలో చిట్వేలి-రాపూరు మధ్య ఉన్న పెనుశిల అభయారణ్యంలో 18 కిలోమీటర్ల మేర ఘాట్‌రోడ్డు ఉంది. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో ఘాట్‌రోడ్డు అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ఆయన మరణాంతరం ఈ రోడ్డు అభివృద్ధి చేయలేదు. ఈ రోడ్డులో 30 మలుపులు ఉన్నాయి. ప్రమాదకర సంఘటనలకు తావిచ్చిన పరిస్థితులు అనేకం ఉన్నాయి. రాపూరు-చిట్వేలి మధ్య ఉన్న ఘాట్ రోడ్డులో ఎదురెదురుగా వాహనాలు వస్తే అతి జాగ్రత్తగా ఉండకపోతే లోయలోకి పడాల్సి వస్తుంది. మలుపుల వద్ద పటిష్టమైన చర్యలు కనిపించవు.

రాష్ట్ర విభజనతో రద్దీగా ఘాట్‌రోడ్డు

రాష్ట్ర విభజన తర్వాత రాజధానికి వెళ్లేందుకు ఈ ఘాట్‌రోడ్డు అనుకూలమైనప్పటికీ ప్రమాదకర పరిస్థితిలో ప్రయాణం కొనసాగించాల్సిందే. అమరావతికి ఇప్పుడు ఈ రోడ్డు మార్గం మీదుగా వెళ్లే వారి సంఖ్య పెరిగింది. ఆర్టీసీ విజయవాడకు బస్సులను నడిపుతోంది. ఘాట్‌రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ప్రైవేటు బస్సులు ఇంకా నడిపేందుకు యాజమాన్యాలు ముందుకు రావడంలేదు. రాపూరు నుంచి వచ్చేటప్పుడు ఘాట్‌రోడ్డు అధ్వానంగా తయారైంది. నెలూరు, అన్నమయ్య జిల్లా కలెక్టర్లు ఘాట్‌రోడ్డు అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గతంలో జరిగిన ప్రమాదాలు..

రాపూరు ఘాట్ రోడ్డులో గత ప్రమాదాలను ఒక్కసారి పరిశీలిస్తే ఈ రోడ్డు ఎంత అధ్వానంగా ఉందో తెలిసిపోతుంది.

- 1983లో పెళ్లి బందం బస్సు బ్రేక్‌ఫెయిలై లోయలో పడి ఇద్దరు మృతి చెందారు.
- 2007 మే 5న ఐదుగురు మరణించారు.
- 2007లో వరదతాకిడికి కదిరి బస్సు చిక్కి ఆరుగురు చనిపోయారు.
- 2008 జూన్‌లో 3న వాకాడు బస్సు లోయలో పడి ముగ్గురు మృతి చెందారు
- 2008 సెప్టెంబరులో రైల్వేకోడూరు బస్సులో లోయలోపడి 14 మంది దుర్మరణం చెందారు
- 2008 అక్టోబరులో ఘాట్ మలుపులో లారీ, బస్సు, స్కూటర్ ఢీకొని భార్యభర్తలు మృతి చెందారు

రహదారిని విస్తరించాలి



రాజంపేట నుంచి విజయవాడ, నెలూరు ప్రాంతాలకు వెళ్లే రహదారిలో రాపూర్ ఘాట్‌రోడ్డును అభివృద్ధి చేయాలి. డబుల్‌రోడ్డుగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాలకులు ఈ రోడ్‌లో ప్రమాదనివారణ చర్యలు మరింత పటిష్ట పరచాలి. ఘాట్‌రోడ్డు అభివృద్ధి ఎన్‌హెచ్ తరహాలో ఉన్నప్పుడే జర్నీ సేఫ్టీగా ఉంటుంది.
- పాపినేని విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లానేత, రాజంపేట

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



రాపూరు ఘాట్‌రోడ్డు విస్తరణ చేపట్టాలి. రాపూరు నుంచి వచ్చేటప్పుడు ఘాట్ రోడ్డు అధ్వానంగా తయారైంది. సింగిల్‌రోడ్డు కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. డౌన్‌లో స్పీడ్ బ్రేకర్లు లేవు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.
- దాసరి పెంచలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లాదళితనేత

క్లుప్తంగా

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం



నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

గాలివీడు : వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ఈ బిల్లుపై కేంద్ర వైఖరి మారేవరకు పోరాటం కొనసాగిస్తామని ముస్లిం మత పెద్దలు హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణంలో వక్ఫ్ బోర్డ్ రాజ్యాంగ సవరణపై మండల ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట సవరణల ద్వారా వక్ఫ్ బోర్డ్ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కేటాయించి ముస్లిం ఆస్తులను అన్యాక్రాంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. మతవిద్వేషాలు రెచ్చగొట్టే విధంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇలాంటి చర్యలు తక్షణమే మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న బాధితులు

బి.కొత్తకోట : ఆటో ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మండలంలోని కాండ్లమడుగు వద్ద జరిగింది. మదనపల్లె సీటీఎం రోడ్డు బాలాజీ నగర్‌కు చెందిన చాంద్ బాషా (25), మహీధర్ (15), ఖైఫ్‌వలీ (10)లు బైక్‌పై శ్రీసత్యసాయిజిల్లా తనకల్లుకు శుభకార్యం కోసం వెళ్లారు. అక్కడ శుభకార్యం ముగించుకుని మదనపల్లెకు తిరుగు ప్రయాణమయ్యారు. బైక్‌పై వీరు కాండ్లమడుగు వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో చాంద్‌బాషాను మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించగా మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

వాహనాలు ధ్వంసం



కారు అద్దాలు పగులగొట్టిన దుండగులు

రాజంపేట : పట్టణంలోని బోయపాలెంలో పలువురి వాహనాలను ధ్వంసంకు గురైయ్యాయి. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కారు, లగేజీ ఆటోల అద్దాలను పగులగొట్టారు. వాహనాల యజమానులు ఆందోళనకు గురయ్యారు. తమ వాహనాలను ఎందుకు ధ్వంసం చేశారో తెలియడం లేదంటున్నారు. రాత్రి పూట పోలీసుల బీట్ లేనట్లుగా ఉందని ఆరోపణలు వెలువడుతున్నాయి. గతంలోనూ సాయినగర్ తదితర ప్రాంతాల్లో ఆరుబయట ఉన్న స్కూటర్లను కూడా కాల్చివేసిన సంఘటనలు ఉన్నాయి.

అటవీ శాఖ హౌస్ బిల్డింగ్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక

కడప అర్బన్ : కడపలోని జిల్లా అటవీశాఖ కార్యాలయం వెనుక వైపున ఉన్న సమావేశ మందిరంలో ఆదివార అటవీశాఖ హౌస్ బిల్డింగ్ సొసైటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సొసైటీ ప్రెసిడెంట్‌గా ఇ.వి రత్నరవి, వైస్ ప్రెసిడెంట్‌గా కె. భాస్కర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా ఎస్. బుడెన్ సాహెబ్, జాయింట్ సెక్రటరీగా రోశయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి. రవికుమార్, ట్రెజరర్‌గా టి. నాగరాజును ఎన్నుకున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పాలన చేతకాకనే మాజీ సీఎంపై మంత్రి వ్యాఖ్యలు



వైద్య విద్య కళాశాలల విషయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం. వైద్య విద్యను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టాలన్న దురుద్దేశంతోనే మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే అందని ద్రాక్షలా మారిన వైద్య విద్యను పేద విద్యార్థులకు మరింత దూరం చేసే ప్రణాళికలను కూటమి ప్రభుత్వం చేస్తోంది. ఈ ఏడాది 5 కొత్తకాలేజీలైన పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పాడేరులలో వసతులను కల్పించలేమని మాట్లాడటం సిగ్గు చేటు.

– శిబ్యాల విజయభాస్కర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రతినిధి



మంత్రి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం



రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మెడికల్ కళాశాలలపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయి. ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తుందా లేదా అన్న విషయాన్ని మంత్రి వెల్లడించాలి. పులివెందుల కళాశాలకు 48 శాతం బోధనా సిబ్బంది లేరు, గదులు లేవు అని చెబుతున్న సత్యకుమార్, వైద్యఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి మూడు నెలలైనా సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలి. అసలు సమస్యను పక్కదారిపట్టించేలా మంత్రి మాట్లాడటం సరైనది కాదు.

– చిట్వేలి రవికుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, రాజంపేట

ఆహ్లాదం.. ఆట విడుపు

అరుదైన వృక్షాలు.. పక్షుల కిలకిలారావాలు. వన్యప్రాణుల కేరింతలు.. ఇలాంటి ప్రకృతి రమణీయ దృశ్యాలను.. పచ్చిక బయలులో కూర్చొని చూడాలని ఎవరికి మాత్రం ఉండదు. కాని నిత్యం ఉరుకుల పరుగుల జీవితం గడిపే నగర వాసికి అలాంటి అవకాశం చాలా తక్కువ. అందువల్లే నిత్యం ఒత్తిడితో గడిపే నగర వాసులకు ఆహ్లాదం పంచేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికి ఈ వనాలు పూర్తి కావచ్చాయి. అటవీ భూముల పరిరక్షణతోపాటు ప్రజల ఆహ్లాదం కోసం 'నగ రవనాలను జిల్లాలో పలుచోట్ల ఏర్పాటు చేస్తున్నారు.

- వైఎస్సార్‌సీపీ సర్కారు కృషితో పట్టణాలకు అటవీశోభ
- రూ.6కోట్లకుపైగా వ్యయం
- నాలుగుచోట్ల చకచకా నగరవనాలు
- వనాల్లో పవిత్ర వృక్షాల పెంపకం



రాజంపేటలో ఏర్పాటు చేసిన అన్నమయ్య ఎకో పార్కు ముఖద్వారం

రాజంపేట : ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నగరవనాలు అన్నమయ్య జిల్లా వాసులకు అందుబాటులోకి వచ్చాయి. నిధులు మంజూరు చేశారు. అటవీ శాఖ జిల్లా కేంద్రంలో అన్నమయ్య ఎకోపార్కు పేరుతో పూర్తి చేశారు. అలాగే జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, మదనపల్లెలో నగర వనాలను ఏర్పాటు చేశారు. కాంక్రీట్ జంగిల్‌లా బతికే పట్టణ వాసులు ప్రకృతి మధ్య సేద తీరేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం జిల్లాలో నాలుగు చోట్ల నగరవనాలకు రూపకల్పన చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల మెప్పు పొందింది. జిల్లాలో దాదాపు పట్టణ శివార్లలో అటవీ ప్రాంతంలో అటవీ అందాలు తిలకించే విధంగా నగరవనాలు రూపుదిద్దుకున్నాయి. ఈ నేపథ్యంలో నగర వనాల నిర్మాణ పనులు శరవేగంతో పూర్తి కావచ్చాయి. ప్రకృతి అందాలు కనువిందు చేయనున్నాయి. ఆ విధంగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ సిద్ధమైంది.

రోజంతా..

నగర వనాలు ఏర్పాటైతే పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా రోజంతా అక్కడ ఉల్లాసంగా గడపవచ్చు. ట్రెక్కింగ్, బోటింగ్, వాకింగ్ ట్రాక్, వన్యప్రాణాల విశిష్టతను వివరించే విజ్ఞాన కేంద్రాలు, ఎన్నో రకాల పక్షుల బొమ్మలు, వాచ్‌టవర్, వివిధ రకాల ఆయుర్వేద మొక్కలు ఏర్పాటు చేస్తున్నారు. అలసిపోతే సేద తీరేందుకు అక్కడక్కడా పుట్టగొడుగుల ఆకారంలో ఉండే పగోడాలు, కుటుంబ సభ్యులు భోజనం చేసేందుకు క్యాంటిన్, పిల్లల కోసం ప్రత్యేకంగా పార్కులు, ఆటవస్తులు ఇలా ఎన్నో నగర వనాల్లో ఏర్పాటు చేయనున్నారు. నామమాత్రపు ఫీజు (పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20)తో ప్రవేశించి నగర వనంలో అటవీ అందాలను కళ్లారా వీక్షించవచ్చు.



నగరవనంలో ఏర్పాటు చేసిన అన్నమయ్య విగ్రహం

నగరాలకు సమీపంలో..

జిల్లాలో ప్రధానమైన రాయచోటి, రాజంపేట , రైల్వేకోడూరు, మదనపల్లె పట్టణాలకు సమీపంలో నగరవనాలు అందుబాటులోకి రానున్నాయి. నగర వనాల ద్వారా పట్టణ వాసులరే ఆహ్లాదం..ఆనందం అందుబాటులోకి రానున్నాయి. ఆరుకోట్ల రూపాయలు పైగా వ్యయం చేస్తూ నగర వనాలు ఏర్పాటు చేయాలని గత జగనన్న ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికి రూ.4కోట్ల వరకు ఖర్చు పెట్టింది.

వనాల్లో పవిత్ర వృక్షాలు..

నగర వనాల్లో కేవలం ప్రకృతి అందాలకే పరిమితం చేయడం లేదు. వనాల్లో పవిత్ర వృక్షాలను ఏర్పాటు చేస్తున్నారు. సంప్రాదాయబద్ధంగా కావాల్సిన మొక్కలను పెంచనున్నారు. వివిధ దేవతామూర్తుల పేరిట మొక్కలు, పూలను కూడా ఏర్పాటు చేసే

పట్టణం	దూరం (కి.మీ)	రూ.వ్యయం	రూ. విడుదల	రూ. ఖర్చు
రాజంపేట	11	2 కోట్లు	1.4 కోట్లు	1.3 కోట్లు
మదనపల్లె	టౌన్	2 కోట్లు	1 కోటి	1 కోటి
రాయచోటి	9	2 కోట్లు	1.4 కోట్లు	1.4 కోట్లు
రైల్వేకోడూరు	1.50	50 లక్షలు	50 లక్షలు	30లక్షలు



పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన చిల్డ్రన్‌పార్కు

నేడు ఇంటి పట్టాలు పంపిణీ

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లె హరిజనవాడ, అరుంధతివాడ పునరావాస గ్రామ ప్రజలకు ఆర్‌ఆర్-5లో సోమవారం ఇంటిపట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పీర్‌మున్నీ తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లు హాజరుకానున్నారని ఆమె తెలిపారు. దాదాపు 628 కుటుంబాలకు ఇంటిపట్టాలు పంపిణీ చేస్తామన్నారు.

రూ. 67 వేలు పలికిన గణేశుని లడ్డు



లడ్డు దక్కించుకున్న మాసపల్లి హరిప్రసాద్

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ, గొల్లపల్లి గ్రామంలో వినాయక స్వామి లడ్డు వేలం పాటలో మాసపల్లి హరిప్రసాద్ రూ. 67 వేలు పాడి లడ్డును దక్కించుకున్నారు. అనంతరం స్వామివారి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

55 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 55 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ చాంద్ బాషా తెలిపారు. శనివారం రాత్రి వన్ టౌన్ పరిధిలోని నక్కల దిన్నె పంచాయతీలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో చుక్కల తాండాకు చెందిన బుక్కే శ్రీనివాసులు నాయక్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 55 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు



కడుపుపై కొట్టడంతో కందిపోయిన దృశ్యం

గాలివీడు : విద్యాబుద్దులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు విచక్షణ మరిచి విద్యార్థిని చితకబాదిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.బాధితుల కథనం మేరకు.. గాలివీడు పట్టణంలోని పెద్దూరుకు చెందిన లియాఖత్ అలీఖాన్ కుమారుడు సర్ఫరాజ్ అలీఖాన్ (8వ తరగతి) స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. గురువారం యథావిధిగా విద్యార్థి పాఠశాలకు వెళ్లగా పరీక్ష పత్రం తీసుకునేందుకు వెళ్ల లేదని అదే పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు రవి ఆగ్రహించి వెదురు కర్రతో విచక్షణా రహితంగా బాదడంతో ఎడమ చేతికి, ఛాతీ భాగం, పిరుదులపైన కందిపోయి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుడికి, మండల విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సదరు ఉపాధ్యాయునిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు



గాయపడిన వెంకట్రాజు, ఆంజనేయులు

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకట్రాజు అనే వ్యక్తికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. సొంత పనుల నిమిత్తం వెంకట్రాజు చిన్నమండెం నుంచి రాయచోటి మండలం శిబ్యాలకు తన ద్విచక్రవాహనంలో వెళ్తుండగా రాయచోటి నుంచి మదనపల్లెకు వెళ్తున్న కారు దేవగుడిపల్లె పెట్రోల్ బంకు సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వెంకట్రాజును 108 సాయంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

కలకడలో..

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ అక్కన్నగారికోట దళితవాడకు చెందిన మద్దిల ఆంజనేయులు తన ద్విచక్రవాహనంలో పీలేరు నుంచి కలకడ మండలంలోని స్వగ్రామానికి బయలుదేరాడు. కె.బాటవారిపల్లె పంచాయతీ పోతువారిపల్లె రోడ్డు సమీపంలో భారత్ పెట్రోల్ బంక్ వద్ద చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ నుంచి పీలేరు వైపు వెళుతున్న హోండాయ్ షాంత్రో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆంజనేయులును 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బంగారు, నగదు చోరీపై కేసు నమోదు



పోలీస్ జాగిలాలతో చోరీ జరిగిన ప్రాంతంలో పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది

ఓబులవారిపల్లె : జె.వడ్డిపల్లె గ్రామానికి చెందిన అనంత ఇంట్లో బంగారు, నగదు చోరీ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.మహేష్ తెలిపారు. ఆదివారం పోలీస్ జాగిలాలతో దొంగతనం జరిగిన గ్రామంలోని ఇంటి పరిసరాలను రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి పరిశీలించారు. రూ.10 లక్షల 50 వేలు నగదు, 20 తులాల బంగారు చోరీకి గురైంది. దీనిపై విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

1.5 కిలోల గంజాయి స్వాధీనం

కమలాపురం : మండలంలోని యువతకు గంజాయి విక్రయిస్తూ వారి జీవితాలను బుగ్గిపాలు చేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు కమలాపురం సీఐ ఎస్‌కె.రోషన్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు.. ఎస్‌ఐ ప్రతాపరెడ్డి, సిబ్బంది గంజాయి విక్రేతలపై నిఘా ఉంచారన్నారు. ఆదివారం ఎస్‌ఐ, సిబ్బందితో కలిసి టి.చదిపిరాళ్ల సమీపంలోని సాయిబాబా గుడి వద్ద దాడులు చేశామన్నారు. గంజాయి విక్రయిస్తున్న చదిపిరాళ్ల గ్రామానికి చెందిన చిట్టే ప్రతాపరెడ్డి, జంగంపల్లెకు చెందిన నరేష్, చెన్నూరుకు చెందిన కాటయ్య, పెద్దచెప్పలికి చెందిన శ్రీనివాసులును అరెస్టు చేసినట్లు తెలిపారు. ప్రతాపరెడ్డి ఇప్పటికే ఒకసారి గంజాయి విక్రయిస్తూ వైజాగ్‌లో పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చారన్నారు. మిగిలిన ముగ్గురితో ఓ ముఠాగా ఏర్పడి వైజాగ్, అరకు, రాజమండ్రి ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి 25 గ్రాముల పాకెట్లుగా చేసి విక్రయిస్తున్నాడని తెలిపారు. వారి నుంచి 1.5 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, రూ.19వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ ప్రతాపరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక, శారీరక వికాసానికి క్రీడలు దోహదం

కడప కోటిరెడ్డిసర్కిల్ : మానసిక, శారీరక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని కడప డివిజన్ ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యాబోధనలో తలమునకలై ఉండే ఉపాధ్యాయులకు ఈ పోటీల నిర్వహణ మంచి ఆటవిడుపు లాంటిదన్నారు.

అన్యాయాన్ని ప్రశ్నించినందుకు ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న సెక్యూరిటీ చీఫ్ ఆఫీసర్ సతీష్, బాధిత విద్యార్థిని తండ్రి

మదనపల్లె : లైంగిక వేధింపులు ఎదుర్కొన్న ఇద్దరు విద్యార్థినులకు అండగా నిలిచినందుకు, తమపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చీఫ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేసిన సతీష్ విలేకరులతో మాట్లాడుతూ...ఆగస్టు 23న అంగళ్లులోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థినులు, అదే కళాశాలలో పనిచేస్తున్న పీటీ మాస్టర్ తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, లైంగికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయాన్ని తాను కళాశాలలో అడిషనల్ డైరెక్టర్ శ్రీలత దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె... పీటీ మాస్టర్‌ను పిలిచి విచారిస్తే, అతను వాస్తవమేనని అంగీకరించి క్షమాపణ చెప్పి వెళ్లిపోయాడన్నారు. అయితే బాధిత విద్యార్థినులు తమపై జరిగిన లైంగిక వేధింపులపై ముదివేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారన్నారు. దీనిపై ముదివేడు సీఐ కళాశాలలో విచారణ జరిపి, సెప్టెంబర్ 3వతేదీన క్రైమ్‌నెంబర్.115/2024 కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారన్నారు. ఈ ఘటనలో బాధితులైన విద్యార్థినులకు అండగా నిలిచినందుకు కళాశాల యాజమాన్యం సెక్యూరిటీ ఆఫీసరైన తనను, అడిషనల్ డైరెక్టర్ శ్రీలతను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. తర్వాత బాధితురాలైన ఇద్దరు విద్యార్థినుల్లో ఒకరిని తమ వైపు తిప్పుకుని, అండగా నిలిచిన ఇద్దరు కళాశాల ఉద్యోగులు, మరో బాధిత విద్యార్థిని తండ్రిపై దురుద్దేశపూర్వకంగా ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టించారన్నారు. ఆడపిల్లలపై లైంగిక వేధింపులు జరగడంపై, బాధ్యత కలిగిన పౌరులుగా స్పందించి అండగా నిలిచినందుకు తమపైనే తప్పుడు కేసులు పెట్టడం దారుణమన్నారు. పోలీసులు ఘటనకు సంబంధించి కళాశాలలోని సీసీ టీవీ ఫుటేజీలు, ఇతర ఆధారాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

హార్సిలీహిల్స్ ఘాట్‌పై కుక్కల దాడిలో దుప్పి మృతి



మృతి చెందిన దుప్పి

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలం పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ అటవీ ఘాట్‌రోడ్డుపై కుక్కల దాడిలో దుప్పి మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. హిల్స్ కింద నుంచి పైవరకు తొమ్మిది కిలోమీటర్ల ఘాట్‌రోడ్డు ఉంది. రోడ్డుకు ఇరువైపులా దట్టమైన అడవి ఉంటుంది. వన్యప్రాణులకు ఈ అడవి పెట్టింది పేరు. ఇటీవల కొండపైకి, ఘాట్‌రోడ్డులో కుక్కల సంచారం, బెడద అధికమైంది. ఈ పరిస్థితుల్లో కుక్కలు ఘాట్‌రోడ్డుకు ఇటు అటు సంచరిస్తున్న వన్యప్రాణులపై దాడులు చేస్తున్నాయి. పైప్‌లైన్స్‌కు, మినిస్టర్ బోర్డు ప్రాంతానికి దిగువన శనివారం ఓ దుప్పిని కుక్కలు వెంటాడాయి. దుప్పి కుక్కల దాడి నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీసినా వదల్లేదు. వెంటపడి దుప్పిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. తీవ్ర గాయాలకు గురైన దుప్పి రోడ్డుపక్కనున్న కాలువలో పడిపోయింది. లేచి అడవిలోకి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అక్కడే పడిపోయి మృతి చెందింది. ఈ ఘటనపై అటవీశాఖ తీవ్రంగా పరిగణించి వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'డాక్టర్ తవ్వా'కు బళ్లారి కల్చరల్ అవార్డు



అవార్డు అందుకున్న డాక్టర్ తవ్వా వెంకటయ్య

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన యువ రచయిత, సాహిత్య పరిశోధకుడు డాక్టర్ తవ్వా వెంకటయ్యకు బళ్లారి కల్చరల్ అసోసియేషన్ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందజేసింది. ఆదివారం బళ్లారి నగరంలోని ప్రముఖ ఆడిటోరియంలో సంస్థ అధ్యక్షుడు శీలం బ్రహ్మయ్య ఈ అవార్డును వెంకటయ్యకు అందజేశారు. నాటక, సాహిత్య రంగాలలో విశేష కృషి చేసిన వ్యక్తులకు ఇచ్చే ఈ పురస్కారాన్ని ఈ సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యుడైన డాక్టర్ తవ్వాకు ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం, గౌరవాధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థిని మృతి



మృతి చెందిన అల్లిక

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో సరోజినీనగర్‌లో నివాసం ఉంటున్న ఉరుకుంద, ఉరుకుందమ్మల రెండవ కుమార్తె వై. అల్లిక (11) అనే విద్యార్థిని ఆదివారం ఇంటి దగ్గర మోటార్ స్విచ్ ఆన్ చేయగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. తల్లిదండ్రులు, అక్క నాగలక్ష్మి పనికి వెళ్లారు. వారు ఎవరూ లేని సమయంలో నీళ్లు రావడంతో మోటార్‌ను వేయగా ఉన్నట్లుండి షాక్ కొట్టింది. దీంతో కిందపడి తీవ్ర అస్వస్థతకు గురైంది. స్థానికులు ఆమెను రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రిమ్స్ ఎస్‌ఐ జయరాములు తెలిపారు.

పేదలకు వైద్యవిద్య అందించాలనే సంకల్పం జగన్‌ది

- అందనిద్రాక్షలా చేసిన ఘనత బాబుదే
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



రాజంపేట : పేద విద్యార్థులకు వైద్యవిద్యను అందించాలనే సంకల్పం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అని, ఆ దిశగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసిందని..అనుకున్న లక్ష్యాన్ని అధిగమించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ,రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు.ఆదివారం తన ఎస్టేట్‌లో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే దిశగా పాలన జరిగిందనే దేశంలోని అన్ని రాష్ట్రాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కొనియాడాయన్నారు. జిల్లాకో మెడికల్ కాలేజీ మంజూరు చేయించి, నిర్మాణాలను చేపట్టారన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటు వల్ల ఎందరో పేద విద్యార్థులకు వైద్యవిద్యను అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిది అని అన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసి చేతులు దులుపుకోవాలని చూసుకొనే ప్రభుత్వం చంద్రబాబుదన్నారు. కూటమి ప్రభుత్వం పేదవిద్యార్థులకు వైద్యవిద్యను అందని ద్రాక్షలా మార్చేస్తోందన్నారు. జిల్లాకు ఒకటి చొప్పున మెడికల్ కాలేజి నిర్మాణాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టారన్నారు. చిత్తశుద్ధి ఉంటే నిర్మాణాలను పూర్తిచేసి, పేదవిద్యార్థులకు వైద్యవిద్యను అందించాలని కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు.

మహిళా కార్మిక హక్కుల రక్షణకు పోరాటం

ప్రొద్దుటూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు పని భద్రత, రక్షణ చట్టాలను అమలు చేయాలని, మహిళా కార్మిక చట్టాల, హక్కుల రక్షణ కోసం పోరాటానికి సమాయత్తం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. స్థానిక ప్యారడైజ్ ఎస్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో స్కీం కార్మికుల రెండు రోజు రాష్ట్రస్థాయి సైద్ధాంతిక శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి.